

# కొలీగ్స్

చంద్రలత

“నేను రెడీ,” కృషి వాచీని మునివేళ్లతో తడుతూ హడావుడిగా వచ్చాడు. అతనితో పాటే సుమధుర పరిమళం. కంప్యూటర్ స్క్రీన్ పై నుంచి కళ్లెత్తి చూశాను. పాలనురుగు లాంటి చొక్కా మెరుపులో ఆకర్షణీయమైన అతని ముఖం మరింత అందంగా వుంది.

నా చూపులు అతన్ని ప్రేమగా తడిమాయి.

“అయిపోయిందా?” ఎలాంటి భావం లేని కృషి గంభీరమైన కంఠం, పొడి మాటలు.

నేను అప్పటికే సిద్ధంచేసి ఉంచిన ఫైళ్లను, ల్యాప్‌టాప్‌ను, కొన్ని స్లైడ్లను అందించాను మౌనంగా.

తన బ్రీఫ్‌కేస్‌లో వాటిని గబగబా సర్దుకొని కృషి వేగంగా వెనుదిరిగాడు.

“కృషీ, వెళ్లేలోగా ఒకసారి రిపోర్ట్ చదవ కూడదూ?” నేను పొడిగానే అన్నాను. కృషి ఏమీ స్పందించలేదు.

“సెమినార్‌లో నవ్వుతూ మాట్లాడు,” ఓ క్షణ మాగి మళ్లీ అన్నాను.

“నవ్వినప్పుడు నువ్వు బావుంటావు.”

కృషి వెనక్కి తిరిగి చురుగ్గా చూశాడు.

అప్పటికి వారంరోజులుగా డెస్క్ ముందు ఆప సోపాలు పడుతున్న నా ముఖం వడలిపోయి ఉంది. కళ్లు మంటలు, మెడ నొప్పి, నడుం పీకుతోంది. కృషి నా కనురెప్పల్ని ముద్దాడితే ఎంత బావుణ్ణు.

“థ్యాంక్స్.” కృషి నిలుచున్న చోటు నుంచి కదల కుండానే మర్యాదగా చెప్పి గబగబా వెళ్లిపోయాడు.

నేనూ కూర్చున్న కుర్చీలోంచి కదలనైనా కదల్లేదు.

ఛ! ముఖాన్ని అరచేతుల్లో ఆన్చుకొని సేదతీరా లని ప్రయత్నించాను.

ఏమిటంత యాంత్రికంగా తయారయ్యాం? మరబొమ్మల్లా.

సింక్ దగ్గరకు వెళ్లి చల్లని నీళ్లు దోసిట్లో నింపు కున్నాను. అలసిన ముఖం దోసిట్లోని నీళ్లతో చల్ల బడింది.

కిటికీ తలుపు తీసి బయటకు చూశాను. చల్ల గాలి ఆప్యాయంగా పలకరించింది. హాయిగా నిలబడి పోయాను, అలాగే. నియాన్‌లైట్ల వెలుగులో నక్షత్రా లను వెతుకుతూ.

ఎన్నాళ్లయిందో, ఇలా!

నిట్టూర్చాను.

రెండు పక్కపక్కని అపార్ట్‌మెంట్స్ తీసుకొని, ఓదాన్ని ఆఫీసులా, మరోదాన్ని ఇల్లులా మార్చుకున్నాం. రెండింటి నడుమ తలుపే అడ్డం. ఇరవై నాలుగు గంటలూ పని చేసుకోవచ్చు- అటు ఆఫీసులోను, ఇటు ఇంట్లోను- ఎలాంటి ఇబ్బందీ లేకుండా.

అప్పుడే తొమ్మిది గంటలయినట్లుంది.

నేను వెళ్లి కంప్యూటర్ ముందు కూర్చోవాలి. కృషికి ఏదైనా సమాచారం కావాల్సి వచ్చినా వెంటనే అందివ్వగలగాలి. ఈమధ్యన మేం ముఖాముఖి మాట్లాడుకోవడం కన్నా కంప్యూటర్ ద్వారా మాట్లాడు కోవడమే ఎక్కువ.

యాంత్రికమై పోతున్నామనుకుంటున్నా, యంత్రాలే వారధి అవుతున్నాయి. నవ్వొస్తోంది.

మేమిద్దరం ఇలా ఎప్పుడు మర్యాద చట్రంలో బిగుసుకుపోయామో గుర్తించనేలేదు.

నానాటికీ వ్యక్తిగత సంబంధం మాయమై పోతోంది. వృత్తిపర బంధం బిగుసుకుంటోంది.

ఆఫీసులోని మిగిలిన సిబ్బందితో పాటు తాము.

అంతే!

ఇవాళ జరుగుతున్న బిజినెస్ సెమినార్‌కి అందరూ కుటుంబసమేతంగా వస్తున్నారు.

తామిద్దరూ? ఒకరు అక్కడ, ఒకరు ఇక్కడ.

సెమినార్ ముఖ్యమైతే, ఎప్పటికప్పుడు అందించాల్సిన సమాచారం మరింత ముఖ్యం.

పై నుంచి తాము చేపట్టిన మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్ ప్రాజెక్ట్‌కి ఇంకాసేపట్లో మెయిల్స్ రావడం మొదలవుతుంది.

ఎక్కడో విదేశాల్లో ఉన్న డాక్టర్లు, వాళ్ల పేషెంట్లకు ఇవ్వాల్సిన ప్రిస్క్రిప్షన్‌లను, కేస్‌షీట్ వివరాలను, డిశ్చార్జి సమ్మరీలను వాయిస్ మెయిల్‌లో పంపిస్తారు. వీలైనంత వేగంగా వాటిని టైప్‌చేసి పంపాలి. వారి ఉచ్చారణ, మాటతీరు సిబ్బంది అందరికీ మింగుడుపడవు. తానే స్వయంగా చూసుకోవాలి.

అందులోనూ సిబ్బంది సాయంత్రం అయిదు గంటలకు వెళితే, మర్నాడు పదింటికే పునర్దర్శనం.

ఎవరికి తప్పినా తనకు తప్పదుకదా!

వేగం... వేగం... వేగం...

ఏమాత్రం ఏమారినా ఈ అవకాశం మరొకరిది.

పోటీ... పోటీ... పోటీ...

ఈ అలుపెరుగని పోటీలో అస్తిత్వం నిలుపుకోవాలనే తపన.

ఆ తపనలో అలుపు సొలుపు తీర్చుకొనే తీరికలేని పరుగు.

అబ్బబ్బా!

మానిటర్ స్క్రీన్‌పై కృషి అక్షరాలు ప్రత్యక్షం.

అప్పుడే ఏదో సందేహం.

నేను చెపుతూనే ఉన్నాను. వెళ్లేలోగా ఒకమారు నేను రాసిన రిపోర్ట్ చదవమని.

నేరుగా మైక్ ముందుకు వెళ్లి కాగితాలు పట్టుకోలేదు. అక్కడికి నయం. చకచకా అతని సందేహాలు తీర్చాను.

మళ్లీ కృషి నుంచి థ్యాంక్స్ సందేశం.

నిట్టూర్చాను.

కళ్లు మానిటర్‌పై ఉంచి గోల్డీకి ఫోన్ చేశాను.

"పాప ఏడ్చి ఏడ్చి పడుకుంది. ఎంత లేపినా లేవట్లేదు. ఈపూట కూడా అన్నం తినలేదు." నాకు లోపలెక్కడో కలుక్కుమంది. నాలుగేళ్ల గోల్డీ అమ్మ దగ్గరకు వెళ్లి వారంరోజులైంది. రోజా ఇంచుమించు ఇదే వార్త.

"ప్రీతీ- రేపు నాకు ఆఫీస్‌లో ఇన్‌స్పెక్షన్ ఉంది..." అమ్మ అర్థంతరంగా ఆపింది.

అప్పుడప్పుడు ఇలాంటి ఒత్తిడి ఉన్నా తన కన్నా అమ్మ అనేక రెట్లు నయం.

ఉద్యోగం చేసి వేళకు ఇంటికి వస్తుంది. ఇతర పనులు చేసుకోను వీలుంటుంది. తనలాగా వేళాపాళా లేని వ్యవహారం అయితే తానూ, తమ్ముడూ ఎలా తట్టుకొనేవారో! ఇలాంటి శీతాకాలాలలో అమ్మ స్వయంగా తయారుచేసి ఇచ్చిన గాలిపటాలు ఎగరేసుకొనేవాళ్లు అందరూ కలిసి. అవన్నీ తీపి గుర్తులే. గోల్డీకి ఇలాంటివి తెలీనైనా తెలీదు.

"గోల్డీని ఉదయం తీసుకెళ్తాను. సారీ అమ్మా- నీకు శ్రమే..."

అమ్మ మాట్లాడలేదు. గోల్డీని లేపాలని ప్రయత్నిస్తోంది.

"వద్దొద్దు... పడుకోనీ..." ఫోన్ పెట్టేశాను.

ఒకే ఊళ్లో ఉన్నామన్న మాటేకానీ ఈ మహానగరంలో వాళ్లో మూల, తామో మూల.

గోల్డీని ఉదయాన్నే తీసుకురావాలి. బడికి పంపాలి. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. చురుకైన పిల్ల. రోజురోజుకూ ముడుచుకుపోతుంది. బాధేసింది.

అదేమాట ఒకసారి అమ్మతో అన్నా.

"ఏమిటీ పని? విసుగొస్తోంది," అని.

"అదేంటి ప్రీతీ అలా అంటున్నావ్? పని లేని వాళ్లు లేదని ఏడుస్తుంటే, ఉన్నవాళ్లు ఉందని ఏడిస్తే ఎలా? తెల్లారేపాటికి ఎన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు పుట్టుకు రావడంలేదు? ఎన్ని కొట్టుకుపోడం లేదూ? అవకాశం అందరికీ వస్తుందా? వచ్చినదాన్ని తెలివిగా మలుచుకోవద్దూ?"

ఆ తరువాత అమ్మతో ఫిర్యాదు చేయడం మానుకొన్నా.

నాన్నతో అన్నా- "నాకు ఈ పని నచ్చడం లేదు. పాపకు ఏ పాఠమో చెపుతూ... ఏ పుస్తకమో చదువుకుంటూ... ఏ పాటో వింటూ హాయిగా ఉండక ఎందుకొచ్చిన గొడవ? ఏం సుఖం?"

"నీది మరీ చిత్రం. కృషి ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాడు. అతన్ని రోజువారీ పనుల నుంచి విముక్తి చేస్తే కానీ ప్రశాంతంగా టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోలేడు. ఈనాడు ఉన్న పోటీలో ఎంత ఒత్తిడిని

తగ్గించుకోగలిగితే అంత నిలదొక్కుకోగలుగుతాడు. నువ్వు కాకపోతే ఎవరు అతన్ని సన్నిహితంగా మంచీ చెడు పంచుకోగలరు? మీ పనిని బట్టే పిల్లలు. వాళ్లే అర్థం చేసుకొంటారు. వదిలేయి,'' నాన్న ఏకబిగిన అన్నాడు.

నిర్లిప్తంగా నవ్వాను.

నిజమే. ఇద్దరం చదివింది ఒక్కటే, ఒక్కచోటే.

కృషి ఏ పూటా తనని ఫలాన పని చేయమని నిర్దేశించలేదు మాట వరసకైనా. తనకై తాను ఏ పూట కాపూట ఏం పని చేయాలో నిర్ణయించుకోవాలి. ఇది ఎంతటి తలనొప్పి వ్యవహారమో. ఎవరైనా ఈ పని చేయి అంటే చకచక చేసేసి చేతులు దులుపుకోవడం హాయి.

ఏం పని చేయాలో, ఎలా పని చేయాలో తానే నిర్ణయించుకోవాల్సి రావడం ఎంత ఒత్తిడి!

ఏదైనా పొరపాటు జరిగితే అంతా తనమీద విరుచుకుపడదూ? అమ్మో!

నాన్న చెప్పినట్లుగా కృషి తన టెక్నికల్ స్కిల్స్ వృద్ధి చేసుకోడానికి పరిమితమైపోయాడు. మెల్లమెల్లగా నాకు తెలియకుండానే ఒక్కో పనీ నా మెడను చుట్టుకుంది. నా మెదడులో అల్లుకుపోయింది. నా అణువణువునూ ఆక్రమించేసింది.

పెరిగిపోతున్న ఖర్చుల మధ్యా, పరిమితమై పోతున్న ఆదాయాల మధ్యా మిణుకు మిణుకు మంటూ కళ్లు తెరిచిన కంపెనీని ఎలా కాపాడుకోవడం? కనుమరుగైపోకుండా నిలదొక్కుకోవడానికి చేసే ప్రయత్నం. ఖర్చులు వెళ్లమార్చడానికి సంపాదించాల్సిన ఒత్తిడి.

ఆ ఒత్తిడిలో కృషి నలిగిపోకూడదు. ఆ ఒత్తిడి అతని తెలివికి పగ్గాలేయకూడదు. ఆ ఒత్తిడికి అతీతంగా అతను తన జ్ఞానాన్ని పెంచుకోవాలి. ఏపూట కాపూట వేగంగా వస్తున్న మార్పును తట్టుకోగల ధీమాను అతను ఆర్జించుకోవాలి. అప్పుడే అతను పదిమందితో పాటు ఒకడుగా కాకుండా పదిమందిలో ఒకడై నిలిచేది.

అతను కోరుకొనేది అదే. అదే అతని కల.

అతని కలే నా కలై కూర్చుంది నాకు తెలియ కుండానే.

అతనికి ఏమాత్రం ఒత్తిడిని తగలనీయని మెత్తని కుషన్‌లా తయారయ్యాను రానురానూ.

"సక్సెస్...! కొత్త ప్రాజెక్ట్ మనదే!" కృషి మెయిల్.

కృషి ముఖం ఇప్పుడు దేదీప్యమానంగా వెలిగి పోతూ ఉంటుంది. సంతోషించాల్సిన నాకు నీరసం వచ్చింది.

మునుపటిలా కృషి కలలను నా కలలుగా మార్చుకొనే సాహసం చేయాలని లేదు.

ఎంతకాలం ఇలా?

ఈమధ్యన నాకు తెలియకుండానే నేనూ కలలు కంటున్నాను.

చిన్నచిన్నవి.

నాకూ ఎవరన్నా అన్నీ అమర్చిపెడితే అందంగా వెళ్లి... నా చాతుర్యాన్ని చక్కగా ప్రదర్శించి అందరి ప్రశంసలూ పొందాలని ఉంది.

నా కనుబొమల కిందుగా నొప్పి మొదలైంది. కుడికన్ను లోలోనికి గుంజుకుపోతున్నంత నొప్పి. అబ్బా! తల చిట్లిపోయేట్లు ఉంది.

"ఆలోచించవద్దు. ఒత్తిడి వద్దు. ఆందోళన వద్దు. వేళకు తిను. వేళకు పడుకో,'' డాక్టర్‌గారి సలహా.

సలహాలకేమీ బోలెడు. ఎలా తగ్గించుకోను ఒత్తిడి?

ఈపాటికి కృషి విందు వినోదాల్లో మునిగిపోయి ఉంటాడు.

నేనూ భోంచేయాలి. గోల్డీ లేదు. కృషి లేడు.

పై నుంచి తలనొప్పి. మెడ నరాలు కూడా లాగేస్తున్నాయి.

ఫ్రిజ్‌లో నుంచి నారింజపండు ఒకటి తెచ్చు కున్నాను. కూరగాయలు లేవు. పళ్లు లేవు. తెచ్చుకోను తీరిక లేదు.

పొద్దున్నే పనిమనిషినైనా పంపించాలి. ఆవిడ ముప్పై రూపాయల కూరగాయలకు యాభై ఖర్చు పెట్టానంటుంది.

నమ్మాలి. నమ్మినట్లు కనిపించాలి.

పై నుంచి సాయం చేసినందుకు చాయ్ ఇవ్వాలి. పాన్‌కి డబ్బివ్వాలి.

తప్పదు.

తెలిసి తెలిసీ మోసపోవాలి- అనేకమార్లు.

ఉసూరుమంటోంది.

ఏం చేయాలి? తప్పడంలేదు.

ఉదయాన్నే గోల్డీని తీసుకురావాలి. బడికి పంపాలి.

సిబ్బంది వచ్చేసరికి ఆఫీస్‌లో రెడీగా ఉండాలి. ఎవరి పని వారికి పురమాయించాలి.

రేపు నా పని ఏముందబ్బా? బ్యాంక్‌కు వెళ్లాల్సి ఉంది.

జీతాలు ఇవ్వాలి. కరెంట్ బిల్లింకా కట్టలేదు. పెనాల్టీతో సహా కట్టాలి. రేపే ఆఖర్రోజు. టెలిఫోన్ కనెక్షన్లు నాలుగున్నాయి. కానీ, ఎప్పుడూ ఏదో ఒకటి అవుటాఫ్ ఆర్డర్. ఒకదాని బిల్లు రాలేదు. అడిగితే పంపా మన్నారు. తీరా చూస్తే బిల్లు కట్టలేదని లైన్ కట్ చేసి వెళ్లారు. పదిగంటల లోగా దాని వ్యవహారం చక్కదిద్దే యాలి. లేకపోతే ఇంటర్నెట్‌లోకి లాగ్ ఆన్ అవడం కష్టం. మిగిలిన రెండు ఫోన్లే అయితే సరిపోవు.

బాప్‌రే!

నా ఆలోచనల్లోంచి బయట పడేస్తూ ఫోన్ మోగింది.

కృషి నుంచి అయి ఉంటుందా?

కాదు. శ్రీకాంత్. వేళకాని వేళ. ఏమిటో విశేషం?

శ్రీకాంత్ కృషి చిన్నప్పటి మాష్టారి కొడుకు. డిగ్రీ పూర్తవగానే వాళ్ల నాన్న రాసిన ఉత్తరం తీసుకొని తమ దగ్గరకు వచ్చాడు. అప్పటికి అతను కంప్యూటర్ ముఖమే ఎరుగడు. ఓనమాలు నేర్పింది తానే. తెలిసీ తెలియక కొన్ని ఫైళ్లు కరప్ట్ చేశాడు కూడా. ఓపిగ్గా అన్నీ సరిచేశాను. మాష్టారి అబ్బాయే కానీ, ఏ విషయమూ త్వరగా నేర్చుకోలేడు. మళ్లీ మళ్లీ చెప్పాలి. ఇప్పటికీ అతని పనిని ఒకటికి రెండుసార్లు సరిచేయాల్సి వస్తోంది.

సాయంకాలం మాట్లాడేగా ఇంటికి వెళ్లాడు. ఇంతలో ఏం అవసరమొచ్చిందబ్బా? అనుకోనివేళ ఫోన్ చేయడమే కాకుండా, అతని కంఠంలో నాకేదో స్ఫురిం చింది. హేళన, కోపం, ద్వేషం అన్నీ కలగలిసిన భిన్న స్వరం. అపస్వరం.

"మీ ఆయనల్లేడా?"

గతుక్కుమన్నాను. సాయంకాలందాకా సౌమ్యత, నమ్రత ఉట్టిపడిన శ్రీకాంత్ గొంతేనా అది? ఆ విరుపే మిటి? ఆ వేగమేమిటి?

నాకు వెంటనే మింగుడుపడలేదు.

"చెప్పు శ్రీకాంత్... ఏమిటి విషయం?" నేను నెమ్మదిగానైనా, స్పష్టంగా అడిగాను.

"చెప్పేదేముంది? ఈ క్షణం నుంచీ నేను మీ కంపెనీలో నుంచి వెళ్లిపోతున్నాను."

"అదేమిటి? ఇంత హఠాత్తుగా?"

"నిన్న ఒక చిన్న ఇంక్రిమెంట్ అడిగాను. మర్చి పోయావా? మీరేమీ మాట్లాడలేదు. నా దారి నేను చూసుకున్నా."

నాకు లోలోన ఒళ్లు మండిపోతోంది. ఒక కంపెనీలో కాళ్లు నేల మీద కాస్త కుదురుకున్నాయో లేదో మరో కంపెనీలోకి తొంగిచూడడం.

నిన్న సాయంత్రం హఠాత్తుగా అయిదువేలు పెంచాలన్నాడు. పరాచకానికి అన్నాడేమో అనుకున్నా. అది హాస్యం కాదు. హెచ్చరిక అన్నమాట!

"వెంటనే చెప్పు. లేదూ నా నిర్ణయం నేను తీసు కుంటా."

ఆలోచించుకొనే వ్యవధి ఏదీ? ఇస్తావా? చస్తావా? బావుంది వ్యవహారం! కూడదీసుకొని అన్నాను, "అదికాదు శ్రీకాంత్..."

"నీతో ఏంటి మాట్లాడేది? మీ ఆయనకి ఈ విషయం చెప్పు. చాలు!" శ్రీకాంత్ ధన్‌మని ఫోన్ పెట్టేశాడు.

నాతో ఏంటీ మాట్లాడేది ?

కృతజ్ఞత లేకపోతేపోయే ఆ చులకన దేనికి? సభ్యత లేకుండా ఏకవచనంలో ఏమిటా మాటలు ?

నా బుర్ర ఓ క్షణం పనిచేయలేదు.

స్తబ్దురాలినై అలాగే కూర్చుండిపోయాను.

చివరికి నాకు దక్కే గౌరవం ఇదేనా?

నేను కృషికి జీవిత భాగస్వామినే.

అంతేకాదు, ఈ కంపెనీకి ప్రధాన భాగస్వామిని.

కంపెనీ వ్యాపారంలో, వ్యవహారంలో కృషికి ఎంత ప్రాధాన్యం ఉందో తనకీ అంతే ఉంది. కంపెనీ కార్యకలాపాల దగ్గర నుంచి సిబ్బంది వ్యవహారాల వరకు తానే అన్నీ చూచుకొనేది.

సిబ్బందికి ఏ ఇబ్బంది వచ్చినా సంప్రతించేది తననే.

సిబ్బందిలో శ్రీకాంత్‌కంటూ ఓ గుర్తింపును సృష్టించింది తానే. ఏం చేయాలో, ఎలా చేయాలో నేర్పించింది తానే. అతనికే కాదు, ప్రతి ఒక్కరికీ.

ఇంత చేసినా సిబ్బంది దృష్టిలో తన స్థానం ఇదేనా?

కృషికి భార్య!

అది తప్పించి తాను మరేమీ కాదూ?

కృషికి వార్తలు చేరవేసే పని తప్ప మరేమీ తెలియదూ?

ఏమిటిదంతా? ఎందుకిలా జరుగుతోంది?

నా తల విచ్చిపోతోంది, నెమ్మది నెమ్మదిగా.

కృషి వచ్చాడు- ఎంతో హుషారుగా, తుళ్లుతూ.

నేను మౌనంగా అతన్నే చూస్తున్నా.

మునుపటిలా నేనూ అతనితో పాటే గంతులేయ లేకపోతున్నా. కృషి సంతోషం నా సంతోషం కాకుండా పోతోంది.

"ప్రీతీ, అసలు నమ్మశక్యంగా లేదనుకో. ఈ ప్రాజెక్ట్ మనకు వస్తుందనే అనుకోలేదు. మనకన్నా పేరున్న కంపెనీలు కూడా వచ్చాయి. నాకు ఎంత సంతోషంగా వుందో తెలుసా," కృషి ముఖం విప్పారి ఉంది.

నిర్లిప్తంగా చూస్తుండిపోయాను.

"ఎటొచ్చీ ఒక చిన్న నిబంధన..." కృషి ఆగి మళ్లీ అన్నాడు. "అయ్యే ఖర్చు అంతా వాళ్లు భరిస్తారు. కానీ, ప్రాజెక్ట్‌ని వాళ్ల కంపెనీ పేరు మీద రిలీజ్ చేయాల్సి ఉంటుంది. పెట్టుబడి వాళ్లది. పని మనదన్నమాట."

నా గుండె గుభిల్లంది.

చిన్న చేపను మింగడానికి పెద్ద చేప కాదు, ఏకంగా తిమింగలమే నోరు తెరిచింది. కృషికి విషయం ఏంటో తెలుస్తోందా? విలీనం కావడమంటే తమకంటూ నామరూపాలు లేకుండా పోవడమే.

"నువ్వేం చెప్పావ్?" నేను కరుగ్గా అడిగాను.

నా మాటల వేగం నాకే కోపాన్ని తెప్పిస్తోంది. కృషితో అలా కటువుగా మాట్లాడి ఉండకూడదు. అవే మాటలు మామూలుగా మాట్లాడవచ్చును. కానీ, నా ఆలోచనా చురుగ్గా ఉందీ క్షణంలో.

"రాన్రాను ఖర్చులు పెరిగిపోతున్నాయని నువ్వేగా అంటున్నావ్. ఎన్నాళ్లని ఇలా చిన్నచిన్న ప్రాజెక్ట్‌లు చేస్తాం? ఏదైనా పెద్ద కంపెనీలో కలిసిపోతే డబ్బుకి ఇబ్బంది ఉండదు కదా," కృషి కూడా నేను అన్నంత వేగంగానే కరుగ్గానే అన్నాడు. వెలిగిపోతున్న అతని ముఖం చప్పున చల్లారింది.

ఏవేవో ఆలోచనలు నన్ను చుట్టుముట్టి గొంతు పెగలకుండా చేశాయి.

కృషి లోపలికి వెడుతూ వెనక్కి తిరిగి అన్నాడు. "రాఘవ కలిశాడు. నిన్ను అడిగానని చెప్పమన్నాడు."

రాఘవ శ్రీకాంత్ లాంటివాడే. తమ దగ్గర కొన్నాళ్లు ఉండి మరో కంపెనీ పెట్టుకున్నాడు.

శ్రీకాంత్ విషయం కృషికి చెప్పాలో లేదోనని ఓ క్షణం సంశయించాను.

ఇప్పటికిప్పుడు చేసేదేం ఉంది? కృషి హాయిగా నిద్రైనాపోతాడు. ఉదయమైనా ఇదే వార్త, అయినా చెప్పాల్సిన బాధ్యత ఉంది కదా!

"శ్రీకాంత్..." చెప్పబోయాను.

"అన్నట్లు రాఘవ శ్రీకాంత్ గురించి ఆరాతీశాడు. చాలా నిజాయితీపరుడు, నమ్మకస్తుడు అని చెప్పా," కృషి మాట్లాడుతూనే టై వదులు చేసుకొంటూ లోపలికి వెళ్లాడు.

నాకు నవ్వొచ్చింది. మెల్లగా విషయం స్పష్టం అయింది. శ్రీకాంత్ కంఠంలో దొర్లిన ఆ అపస్వరం వెనుక రాఘవ ఇచ్చిన ధైర్యం ఉందన్నమాట!

"గోల్డీ రాలేదా?" కృషి మళ్లీ అడిగాడు.

మౌనంగా తల అడ్డంగా ఊపాను.

కృషి కొన్ని కాగితలు తీసి నా డెస్క్‌మీద పెట్టాడు.

"రేపు ప్రాజెక్ట్ తాలూకు అగ్రిమెంట్ కాగితాలపై సంతకాలు పెట్టాలి. మోడల్ ఇది. పదిగంటలకు వాళ్లు మన ఆఫీస్‌కు రావచ్చు," కృషి కళ్లు వాల్చి అన్నాడు.

"నువ్వూ కాసేపు విశ్రాంతి తీసుకోకూడదూ? మిగిలిన పని పొద్దున్న చేసుకోవచ్చుగా."

కృషి కంఠం ఆత్మీయ ఆహ్వానాన్ని అందిస్తోంది. ఇలాంటి ముద్దు మురిపాలన్నీ మా నడుమ ఆవిరయిపోయాయి. నా గుండె నీరయింది. లోలోపల తొలుస్తున్న తపన ఏదో నన్ను తలూపనీయలేదు.

కృషి వంక చూడకుండా నెమ్మదిగా అన్నాను, "ఇంకాసేపట్లో తెల్లారిపోతుంది. చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. వారంరోజుల నుంచీ ఈ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారుచేయడంలో సాయం చేశారని ఇవాళ ఇద్దరు సెలవు పెట్టారు. మరెంతమంది చెప్పకుండా మానేస్తారో తెలియదు. డాక్టర్స్ నుంచి వచ్చే మెయిల్స్ డౌన్‌లోడ్ చేస్తున్నాను. వాటన్నిటినీ ట్రాన్స్‌స్క్రిప్ట్ చేయద్దూ? పైనుంచి నీ అగ్రిమెంట్ కాగితాలు తయారుచేయాలి. నువ్వెళ్లి పడుకో. నిద్రొస్తే నేనే వచ్చి పడుకుంటాలే."

నా నిర్లిప్తత అతనికి స్ఫురించి ఉంటే రెండు గొంతులు వినిపించేవి.

బాధ్యత వేసిన సంకెళ్ల శబ్దం. భార్య అనుభవిస్తున్న వేదన సవ్వడి.

కృషి నిశ్శబ్దంగా తలాడించాడు. మౌనంగా లోపలికి వెళ్లాడు. కృషి మౌనంలో వినగలిగితే నాకూ ఆ రెండు గొంతులు వినిపించి ఉండేవేమో. కానీ, నా చెవులు దిబ్బళ్లు పడ్డాయి.

కృషి అందించిన ఆహ్వానాన్ని తిరస్కరించినందుకు బాధపడనంతగా నేను మొద్దుబారిపోయాను.

ఛ! అంతకు మించి నా చెవులలో శ్రీకాంత్ మాటలు గింగురుమంటున్నాయి. నన్ను ఊపిరాడనీయకుండా నిలవేస్తున్నాయి.

కృషి వాళ్లావిడకి, ప్రీతికి తేడా లేదూ?

ఒకే పనిలో నిమగ్నమై ఉన్నంత మాత్రాన భార్య భర్తలలో ఎవరి ప్రాధాన్యత వారిది కాదూ?

నా తలనొప్పి తీవ్రమైంది- తల నరాలు చిట్లిపోయేంతగా.

కృషి చల్లగా తెచ్చింది ఇంకా తీవ్రమైన వార్త.

ఈ రెండింటికి మధ్యా నాకేదో సంబంధం కనిపిస్తోంది.

ఈపూట జరిగిన వ్యాపార సమావేశం, విందు వినోదాలు, చేతికి ఇచ్చి పంపిన అగ్రిమెంట్ కాగితాలు- అన్నీ పెద్ద కుట్ర. అప్రమత్తమయ్యే అవకాశమే లేకుండా ఆవురావురుమంటూ మింగేసే ఆపద. తమ కంపెనీ ఆనవాళ్లే కానరాకుండా తుడిచివేసే ప్రయత్నం.

ఈ కంపెనీ ప్రారంభం నుంచీ ఈ పూట వరకూ నా సర్వశక్తులూ కంపెనీకే. అలాంటిది కంపెనీకి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయాన్ని కృషి నాకో మాట మాత్రమైనా చెప్పకుండా, తనపాటికి తాను అంత తేలిగ్గా ఎలా తీసేసుకోగలిగాడు? నా అభిప్రాయం ఏంటో అడగాలనైనా అనుకోలేదు. ఏమిటిదంతా?

మాలాంటి చిన్నచిన్న కంపెనీలను విలీనం చేసుకొని పెద్ద కంపెనీలు ఎదిగినట్లే, నాలాంటివారి మెదళ్ల తో పాటు హృదయాలనూ స్వాధీనం చేసుకొని కృషి లాంటివారు ఎదుగుతారు.

చిన్న కంపెనీలు ఉనికిని కోల్పోతాయి. నేను ఉనికితో పాటు నా అస్తిత్వాన్నే కోల్పోయాను.

అయ్యో, ఎంత పొరపాటు జరిగింది!

కృషి గుర్తింపు నా గుర్తింపు అవుతుందా? కృషి గౌరవం నిలబెడితే సరిపోతుందా? నా గౌరవం నిలబెట్టుకోవద్దూ? కృషికి ఏ ఒత్తిడీ తగలనీయని కుషనేకాదు తాను. జవజీవాలున్న మనిషి. ఈ విషయం ఇన్నాళ్లూ తనకెందుకు స్ఫురించలేదో! అందుకు చెల్లించిన మూల్యం చాలు.

రాఘవ, శ్రీకాంత్- వీళ్లలా ఓ శుభోదయాన తానూ కంపెనీని వదిలి వెళ్లిపోగలదా! ఒక విధంగా వాళ్లిద్దరికీ గురువు తాను. వాళ్లకున్న ధైర్యం తనకు లేదూ? వాళ్ల కన్నా ఘనంగా తాను నిలదొక్కుకోలేదూ?

కానీ, ఉద్యోగానికి, జీవితానికి మధ్య పెనవేసుకుపోయిన సున్నిత బంధం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. తెగేదాకా లాగకూడదు కదా! అది కృషికి తెలవాలి! కృషి తన భర్త. కృషి తన సహోద్యోగి. కృషి కల కంటే కళ్లెదుట నిలిపింది. కృషి ఆలోచిస్తే ఆచరిస్తూ వచ్చింది ఇన్నాళ్లూ.

ఇదే మరోచోట అయి ఉంటే, మరో కొలీగ్ నా ఆలోచన మీద అనవసర ఆధిపత్యం చలాయిస్తుంటే చూస్తూ ఊరుకుంటానా? ఇప్పుడు నా సహోద్యోగి నా భర్త కాబట్టి పట్టించుకోకుండా వదిలేయడం నా తప్పు కాదూ?

ఏ విదేశ తిమింగలమో మింగేయకుండా కంపెనీ ఉనికిని కాపాడుకోవడానికి ముందుగా నా ఉనికిని మింగేస్తున్న ఈ విపత్తు నుండి నన్ను నేను కాపాడుకోవద్దూ?

కృషి, తానూ భార్యాభర్తలు. సహోద్యోగులు. అంతేకాదు, తామిద్దరూ గోల్డీకి అమ్మానాన్నలు.

తమ వ్యక్తిగత సంబంధాల్లో స్పష్టత రాకుండా వృత్తిపరబంధంలో పారదర్శకత వస్తుందా?

ఆలోచిస్తూ నేనొక నిర్ణయానికి వచ్చాను.

కృషి తయారుచేయమన్న అగ్రిమెంట్ కాగితాలను తాపీగా చింపి చెత్తబుట్టలో వేశాను.

తేలికపడ్డ మనసులో భారమంతా మటుమాయమైంది. తిన్నగా ఇంట్లోకి వెళ్లాను.

కృషిని నిద్ర లేపడానికి.

నా నిర్ణయం తెలపడానికి.

*ఇండియా టుడే వారపత్రిక, 29 మే 2001*